ప్రజాశక్తి
శనివారం 19 ఏప్రిల్ 2025 | 5 | అనంతపురం



నాలుగు రైళ్లు దారి మళ్లింపు

ప్రజాశక్తి-రాయదుర్గం

గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో గుంతకల్లు, గుత్తి, ధర్మవరం రైల్వే స్టేషన్ల నడుమ అభివృద్ధి పనులు జరుగుతున్న దృష్ట్యా 4 రైళ్లను దారి మళ్లించినట్లు నైరుతి రైల్వే ముఖ్య సమాచార అధికారి బిఎల్.శివకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16591/92 హుబ్బళ్లి మైసూర్ మధ్య నడిచే రైలు మే 11 నుంచి 17వ తేదీ వరకూ గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం మార్గంలో కాకుండా బళ్లారి, రాయదుర్గం, చిక్కజాజూరు, యశ్వంత్‌పూర్ మార్గంలో నడుస్తుంది. 16531/32 బెంగళూరు (ఎస్‌బిసి)-అజ్మీర్ మధ్య నడిచే రైలు మే 12, 15వ తేదీ గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం మార్గం లో కాకుండా యశ్వంత్‌పూర్, చిక్కజాజూరు, బళ్లారి, హుబ్బళ్లి మార్గంలో నడుస్తుంది. 16533 భగత్‌కి కోటి(జోధ్‌పూర్)-బెంగళూరు మే 14వ తేదీ హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు మీదుగా కాకుండా బళ్లారి, రాయదుర్గం, చిక్కజాజూరు, యశ్వంత్‌పూర్ మార్గంలో నడుస్తుంది. ప్రయాణికులు ఈ విషయాలను గమనించాలని శివకుమార్ సూచించారు.

శింగనమల

తమ్ముళ్ల బాహాబాహీ..!



◆ సెట్ అవ్వని శింగనమల సైకిల్

శింగనమల నియోజకవర్గం టిడిపిలో తమ్ముళ్ల మధ్య ఇప్పటికీ సయోధ్య కుదరలేదు. ఢీ అంటే ఢీ అంటూ ఒకరిపై ఒకరు తలపడుతున్నారు. గతంలోని ఘటనలను పునరావృతం చేస్తూ మరోమారు బాహాబాహికి దిగారు. ఏకంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి టిజి.భరత్ ఎదుటనే ఎమ్మెల్యే బండారు శ్రావణి, ప్రత్యర్థి వర్గాలు ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకున్నారు. ఈ పరిణామంతో ఒక్కసారిగా ఇన్‌ఛార్జి మంత్రి అసహనానికి గురయ్యారు. పోలీసులు ఇరువర్గాలకు సర్దిజెప్పి అక్కడి నుంచి పంపించాల్సి వచ్చింది.



ఆర్అండ్‌బి వద్ద గుమిగూడిన శింగనమల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు

◆ ఇన్‌ఛార్జి మంత్రి ఎదుటే పరస్పరం సవాళ్లు

◆ అనంత ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఘర్షణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల నియోజకవర్గంలో టిడిపి అధికారంలో లేనప్పటి నుంచి ఆ పార్టీ ముఖ్య నేతల మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బండారు శ్రావణి ఉన్నప్పటికీ టుమెన్ కమిటీని వేశారు. ఈ గొడవల నడుమే ఆ నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యేగా బండారు శ్రావణి గెలుపొందారు. అదే విధంగా రాష్ట్రంలోనూ టిడిపియే అధికారంలో వచ్చింది. అయినా ఇప్పటికీ టుమెన్ కమిటీనే కాకుండా ఇతర నేతలతోపాటు, ఎమ్మెల్యే బండారు శ్రావణి మధ్య సయోధ్య లేదు. ఈ ప్రభావం ఆయా మండలాల్లోని నేతల మధ్య వరకు ఉంది. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు గ్రూపులుగా విడిపోయి ఉన్నారు. ఒక గ్రూపునకు మరొక గ్రూపునకు మధ్య పొసగడం లేదు. దీంతో ప్రతి పనిలోనూ రెండు గ్రూపుల మధ్య తగాదాలతో పనులు ముందుకు సాగడం లేదు. ఈ నేపథ్యంలోనే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి టిజి.భరత్ పార్టీ సమావేశం కోసమని శుక్రవారం నాడు అనంతపురం నగరానికి విచ్చేశారు. ఆర్అండ్‌బి అతిథి గృహం వద్దకు నియోజకవర్గ నాయకులు విచ్చేశారు. ఎమ్మెల్యే బండారు శ్రావణికి వ్యతిరేకంగా ఆమె ఎదుటే ఇన్‌ఛార్జీ మంత్రి టిజి.భరత్‌కు ఫిర్యాదులు అందజేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కంటే ఆమె తల్లి షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆమె పనిచేసిన కార్యకర్తలకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఎదురొడ్డి నిలబడి ఎంపిటిగా గెలుపొందిన తమకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని వెస్టునరసాపురం అంజనమ్మ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. యల్లనూరు మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, స్టోర్ డీలర్లలో అన్యాయం చేసారంటూ వాసాపురం బాబు, అదే మండలానికి చెందిన బొప్పేపల్లి రవిల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అతిథి గృహం ఆవరణంలో పరస్పరం బాహాబాహీకి దిగారు. పోలీసులు ఇరువర్గాలను బయటకు పంపించారు. అక్రమ కేసులతో తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కణంపల్లి ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా శింగనమల నియోజకవర్గంలోని గ్రూపు తగాదాలు శుక్రవారం నాడు బాహాటంగానే జరిగాయి. అయితే ఇప్పటికీ కూడా ఈ తగాదాలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మాత్రం ఇవి అన్నదమ్ముల మధ్య గొడవలేనని చెప్పడం గమనార్హం. మొత్తానికి శింగనమల నేతల మధ్య సయోధ్య ఎప్పటికి కుదేరేనోనని చూడాల్సి ఉంది.

హక్కులను హరించేలా కేంద్రం నిర్ణయాలు

◆ వక్ఫ్ బోర్డు సవరణ చట్టం నష్టదాయకం

◆ ఎన్డీఎ కేంద్ర ప్రభుత్వ మతతత్వ విధానాలను ఎండగట్టాలి

◆ రాజకీయ పార్టీలు, ప్రజా, ముస్లిం సంఘాల నేతలు

◆ జిల్లా వ్యాప్తంగా ప్రజాశక్తి ప్రత్యేక సంచికలు ఆవిష్కరణ



టవర్‌క్లాక్ వద్ద ప్రజాశక్తి ప్రత్యేక సంచికలను ఆవిష్కరిస్తున్న పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, ముస్లిములు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ముస్లిం, మైనార్టీల హక్కులను కాలరాసేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్ణయాలు చేస్తోందని, అందులో భాగంగానే ఇటీవల వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదింపజేసుకున్నారని పలు రాజకీయ పార్టీలు, ప్రజా, ముస్లిం సంఘాల నేతలు తెలిపారు. వక్ఫ్ బోర్డ్ నూతన చట్టం అమలైతే కలిగే నష్టాలు, పర్యావసనాలను తెలియజేస్తూ ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సంచికను రూపొందించింది. ఈ సంచికను జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ శుక్రవారం నాడు ఆవిష్కరించారు. అనంతపురంలో టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద ఆవాజ్ ఆధ్వర్యంలో ఆ సంఘం అధ్యక్షులు వలి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, నగర మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ మాజీ ఛైర్మన్ నదీం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న మతతత్వ రాజకీయాల్లో భాగంగానే వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ ఒక్క పార్లమెంటు సీటును కూడా ముస్లింలకు కేటాయించని బిజెపి ముస్లింల ఆస్తులు కాపాడుతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బిజెపి క్రైస్తవుల ముస్లింల విలువైన భూములను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడానికి పన్నిన పన్నాగమే వక్ఫ్ బోర్డు సవరణ చట్టం అన్నారు. ఉర్దూ అకాడమీ మాజీ ఛైర్మన్ నదీం మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన ఈ చట్టంపై చంద్రబాబు నాయుడు తన వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణస్వామి మాట్లాడుతూ మతోన్మాద బిజెపి చేస్తున్న కుట్రలను సిపిఐ అడ్డుకుంటుందని హిందూ ముస్లిం క్రైస్తవులు ఐక్యమై ఇటువంటి కుటిల ప్రయత్నాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పేద ముస్లింలకు అందించాల్సింది పోయి ఆస్తులనే కాజేసే పన్నాగం పన్నడం దుర్మార్గం అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దాదా గాంధీ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపిని దించి లౌకిక ప్రభుత్వం ఏర్పడాల్సిన అవసరం దేశానికి ఎంతైనా ఉందన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ కోట్ల విలువైన వక్ఫ్ఆస్తులపై కార్పొరేట్, మతోన్మాద శక్తుల కన్ను పడడం మూలంగానే ఈ చట్టం బిజెపి తెచ్చిందని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ ఎకెఎస్‌ఫయాజ్ మాట్లాడుతూ ఈ చట్టం ముస్లింల్లో అభద్రతాభావాన్ని పెంచుతుందన్నారు. నగరంలోని 25 మసీదుల వద్ద వక్ఫ్ బోర్డ్ ప్రజాశక్తి ప్రత్యేక సంచికను పంపిణీ చేసినట్లు ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి తెలిపారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ రాష్ట్ర మాజీ ఛైర్మన్ రిజ్వాన్, మానవ హక్కుల వేదిక నాయకుల అబ్దుల్ రసూల్, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరాములు, ఖాజా హుస్సేన్, రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్, ఐఎంఎం బాషా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, టిప్పు సుల్తాన్ సొసైటీ నాయకులు నజీద్, రాజీవ్ కాలనీ ఉప సర్పంచి మసూద్, డివైఎఫ్ఐ నాయకులు నూరుల్లా, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జీవ, ఓబులేసు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, ముర్తుజా, లతీఫ్, ఇర్ఫాన్, శీన, ప్రజా సంఘాల నాయకులు జాకీర్, ఆవాజ్ నాయకులు దాదు, ఇమాం బాషా, వలి, కార్పెంటర్, ముబారక్, నూర్ బాషా, షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న మేయర్ వసీం

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

అనంతపురం కార్పొరేషన్ : వక్ఫ్ సవరణ చట్టంపై ప్రజాశక్తి దినపత్రిక తీసుకొచ్చిన ప్రత్యక సంచికను అనంతపురం నగర పాలకసంస్థ మేయర్ మహమ్మద్ వసీం సలీం తన క్యాంప్ కార్యాలయంలో వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షులు కె.రిజ్వాన్, ప్రజాశక్తి అనంతపురం ఎడిషన్ మేనేజర్ ఎన్.వేణుగోపాల్‌తో కలిసి శుక్రవారం ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా అయన వక్ఫ్ చట్టం సవరణ బిల్లు కేంద్రం తీసుకు రావడం వెనుక అనేక అనుమానాలు మైనార్టీలకు ఉన్నాయన్నారు. వీటిపై ప్రజాశక్తి దినపత్రికప్రతేక సంచిక తీసుకు రావడం అభినందనీయం అన్నారు. ఈకార్యక్రమంలో ప్రజాశక్తి డెస్క్ ఇన్‌ఛార్జి శివప్రకాశ్, స్టాఫర్ షఫీ ఉల్లా, సుధాకర్, నరసింహస్వామి పాల్గొన్నారు.



పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

గాలివాన బీభత్సం

గడేకల్లు, చీకలగురికిలో నష్టం

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ మండల పరిధిలోని గడేకల్, చీకలగురికి, పాల్తూరు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సం సష్టించింది. గాలివాన దాటికి గ్రామంలో చాలాచోట్ల పెద్దచెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో పాటు, కొన్ని చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. గాలివాన ఉధృతికి గడేకల్ గ్రామానికి చెందిన బోయ వెంకటేష్ గాలిమిషన్‌తో పాటు రేకులషెడ్డు గాలికి కొట్టుకుపోయింది. మిరప పంటలు అకాల వర్షాల ప్రభావంతో తడిచిపోయాయి. చీకలగురికి గ్రామంలోని ఎస్సీ కాలనీలో పెద్దన్న ఇంట వద్ద నుంచి టైలర్ నగేష్ షాపు వరకు వర్షపు నీరు నిలిచింది. నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన మిరప రైతులు తోపాటు గాలి మిషన్ నిర్వాహకుడు బోయ వెంకటేసులును ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి కోరారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వ్యవసాయానికి 9 గంటల నిరంతర విద్యుత్

◆ 10వేల రూఫ్‌టాప్ యూనిట్లు ఏర్పాటు చేస్తాం

◆ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

◆ మడకశిర నియోజకవర్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల ప్రారంభం

◆ పాల్గొన్న రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ



విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు

ప్రజాశక్తి-మడకశిర, అగళి

వ్యవసాయానికి సంబంధించి రైతులకు పగటిపూట 9 గంటల నిరంతరాయ విద్యుత్ సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మడకశిర నియోజకవర్గం మడకశిర రూరల్ మండలం వైబిహల్లి గ్రామంలో.33/11కెవి, విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం, రొళ్ల మండలం రంగహల్లి గ్రామంలో. 33/11 కెవి నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ, అగళి మండలం ఇనగలూరు గ్రామంలో. 33/11 కెవి విద్యుత్ నూతన సబ్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె.పార్థసారథిలి మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్.రాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల అంజనప్ప, తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగహళ్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 10 వేల రూఫ్‌టాప్ యూనిట్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. మడకశిర నియోజకవర్గం నాలుగు గ్రామాల్లో దాదాపు రూ.16 కోట్ల వ్యయంతో నాలుగు 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ నాలుగు ఉప కేంద్రాల పరిధిలోని 42 గ్రామాల్లోని 3299 మంది రైతులకు పగటిపూట తొమ్మిది గంటలు నిరంతరాయ విద్యుత్ సరఫరా, 10,319 మంది ఇతర విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. మడకశిర మండలం గుండుమల, రొళ్ల మండలం రంగనపల్లి, గుడిబండ, కేకే పాల్యంలో రూ.12 కోట్లతో కొత్త సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇవి అందుబాటులోకి వస్తే ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ సురేంద్ర, ఈఈ భూపతి, మడకశిర ఇంజినీర్ రఘు, ఆర్డీవో ఆనంద్ కుమార్, మడకశిర నియోజకవర్గం ప్రత్యేక అధికారి సూర్యనారాయణ రెడ్డితో పాటు ఆయా గ్రామస్తులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నరికివేసిన చీనీచెట్లు

చిత్రచేడులో మామిడిచెట్లు నరికివేత

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలోని చిత్రచేడు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు మామిడి చెట్లను నరికివేసిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. చిత్రచేడు గ్రామానికి చెందిన చిన్ననారాయణ, లక్ష్మన్న, సూర్యనారాయణ, చిన్నపుల్లన్న రైతుల పొలాల్లో మూడేళ్ల క్రితం మామిడి మొక్కలను నాటారు. వీరిపై కక్షకట్టిన కొందరు వారిని ఆర్థికంగా నష్టం చేకూర్చాలని ఉద్దేశంతో గురువారం రాత్రి తోటలోకి ప్రవేశించి నాలుగు ఎకరాల్లో నాటుకున్న సుమారు 105 మామిడి చెట్లను నరికివేశారు. శుక్రవారం ఉదయం తోటకు వెళ్లి చూడగా నరికివేసిన చెట్లు కన్పించాయి. కంటికి రెప్పలా కాపాడుకున్న చెట్లను నరికివేయడం చూసి రైతులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. తమకు ఎవరితోనూ కక్షలు లేవని, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయాలనే నేపంతోనే ఇలా చేశారని బాధిత రైతులకు పోలీసులకు తెలిపారు. ఎస్ఐ ఆంజనేయులు సిబ్బందితో పొలాన్ని పరిశీలించారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెడీమేడ్ టెక్స్‌టైల్ పరిశ్రమ ఏర్పాటు చేయండి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి టిజి.భరత్‌కు ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి - కూటమి నేతల సమన్వయ కమిటీ సమావేశం



కూటమి నేతల సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో రెడీమేడ్ టెక్స్‌టైల్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్‌కు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి భరత్ శుక్రవారం నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో నిర్వహించిన కూటమి సమన్వయ కమిటీ సమావేశంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. అర్బన్ నియోజకవర్గంలో కూటమి (మూడు) పార్టీల వైపు నుంచి సమస్యలు, విజ్ఞప్తులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో కూటమి పార్టీలు బలంగా ఉన్న నేపథ్యంలో నామినేటెడ్ పోస్టులు, ఇతర అంశాల విషయంలో అర్బన్ నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా చూడాలని ఎమ్మెల్యే దగ్గుపాటి మంత్రిని కోరారు. అనంతపురం నియోజకవర్గంలో ఏటేటా జనాభా పెరుగుతున్నా అందుకనుగుణంగా ఉపాధి అవకాశాలు రావడం లేదన్నారు. ఉపాధి, ఆదాయ ఉత్పత్తికి సంబంధించి ఎలాంటి అవకాశాలు లేక చాలా మంది ప్రజలు పేదరికంలో ఉన్నారన్నారు. కావున జిల్లాకు రెడీమేడ్ టెక్స్‌టైల్ పరిశ్రమ మంజూరు చేయాలని, తద్వారా వేలాది మందికి ఉపాధి లభించడమే కాకుండా అనుబంధ యూనిట్ల ద్వారా ఆర్థిక వనరులు పెరుగుతాయన్నారు. నైపుణ్యం ఆధారిత ఉపాధి ద్వారా ఈ ప్రాంతంలోని యువత, మహిళలను సాధికారపరచడంలో ఇది ఎంతగానో దోహదపడు తుందన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఇలాంటి పరిశ్రమ ఏర్పాటు చేస్తే వేలాది మందికి ఉపాధి మార్గం చూపించవచ్చున్నారు. దీనిపై మంత్రి భరత్ సానుకూలంగా స్పందించారు. ఉన్నత స్థాయిలో చర్చించి టెక్స్‌టైల్ పరిశ్రమలతో సంప్రదింపులు చేస్తామని మంత్రి టిజి.భరత్ హామీ ఇచ్చారు.

ఆయిల్‌తో కూడిన వస్తువులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-అనంతపురం

కర్మాగారం పరిసర ప్రాంతాల్లో ఆయిల్‌తో నిండిన గుడ్డలు, చెత్త, చెదారాలపై అప్రమత్తంగా ఉంటూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా అగ్నిమాపక అధికారి వి.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. అగ్నిమాంక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గార్లదిన్నె మండలంలోని సప్తగిరి క్యాంపర్ ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు హైడ్రేట్ ద్వారా ఎలా నీటిని చల్లాలి, జెట్ రూపంలో ఎలా కొట్టాలనే విషయాలపై ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి క్యాంపర్ ఉపాధ్యక్షుడు యుఎండి హనీఫ్, జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి కెపి లింగమయ్య, ఎస్.రమేష్ కుమార్‌రెడ్డి, జి.గోవిందరాజులు, ఎస్.రామయ్య, కె.షణ్ముకుమార్, బి.మదన్మోహన్‌రెడ్డి, పి.సంజీవరాయుడు, ఇ.ఈరేష్‌గౌడ్, బి.రాఘవేంద్ర, బి.పెంచలయ్య, వై.ఓబిరెడ్డి, ఎ.వంశీకృష్ణ, బి.అంకిరెడ్డి, సి.మధుసూదన, ఎం.రమేష్, ఎస్.అక్బర్ బాషా, బి.మనోహర్, జి.శివన్న, ఎం.బాల వెంకటయ్య, కె.తిరుపాలు, బి.రవి, డి.శివతేజ, డి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఉరవకొండలోని ఆర్టీసీ డిపోలో అగ్ని ప్రమాదాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆర్‌టిసి డిపో మేనేజర్ అధ్వర్యంలో సిబ్బందితోపాటు ప్రయాణికులు, ఆర్టీసీ పెట్రోల్ బంకులో పని చేస్తున్న సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ ఆర్టీసీ డిపో సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

గుంతకల్లు : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని అంజుమాన్ కమిటీ సభ్యులు వలి, ఆర్డిజి బాషా, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ప్రజాశక్తి దినపత్రిక ప్రచురించిన ప్రత్యేక సంచికను శుక్రవారం ఐదు మసీదుల వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిముల మనోభావాలు దెబ్బతినే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ నాయకులు అబ్దుల్లా, షబ్బీర్, షాషా, మస్తాన్, వైసిపి విద్యార్థి విభాగం నియోజకవర్గ కన్వీనర్ అబ్దుల్ బాహిద్, మైనారిటీ నాయకులు నూర్ నిజామి, మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.

గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

ప్రజాశక్తి- బొమ్మనహాల్

బొమ్మనహాల్‌తో పాటు మండలంలోని ఉద్దేహాల్, శ్రీధరఘట్ట, శ్రీరంగాపురం, గోవిందవాడ, హరేసముద్రం, పొన్నూరు, బండూరు గ్రామాల్లో క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. చర్చిల్లో పాస్టర్లు క్రైస్తవులకు ఏసుక్రీస్తు సందేశాన్ని వినిపించారు. ప్రతిఒక్కరూ శాంతి, సమానత్వం, ఓర్పు, నేర్పు కలిగి జీవించాలని సూచించారు.

రాయదుర్గం : పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో ఉన్న కింగ్ ఆఫ్ షాలోమ్ క్రైస్ట్ చర్చి ఆవరణ లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ జె.కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బైబిల్ పరిశోధన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా 'బైబిల్ సిలువ సందేశాన్ని' హైకోర్టు న్యాయవాది, మానవ హక్కుల నేర నిరోధక సంస్థ ఛైర్మన్ పాస్టర్ బి.రాకేష్‌నాయక్ తెలిపారు. అనంతరం పిల్లలు, మహిళలు, యువత, విశ్వాసులు సిలువ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో చర్చి అభివృద్ధి మండలి సభ్యులు రాజశేఖర్, మురళి, రామంజి, చిన్నబాబు, రాజన్న పాల్గొన్నారు.



క్రీస్తు సందేశాన్ని విన్పిస్తున్న పాస్టర్

ప్రజాశక్తి
www.prajasakti.com

బిసిఐ కో-చైర్మన్ వైఆర్.సదాశివారెడ్డిపై దాడి దుర్మార్గం

బార్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ ఆలూరు రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బెంగళూరులోని తన ఛాంబర్‌లో కేసులను అధ్యయనం చేస్తూ, విధి నిర్వహణలో ఉన్న సమయంలో ఒక కక్షిదారుడు ఛాంబర్‌లోకి ప్రవేశించి బీసీఐ కో-చైర్మన్ వైఆర్.సదాశివారెడ్డిపై రాడ్లతో దాడి చేసిన ఘటన దుర్మార్గమని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఆలూరు రామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. దేశంలో న్యాయవాదుల అత్యున్నత స్టాట్యుటరీ సంస్థ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు కో-చైర్మన్‌గా ఉన్న ఒక సీనియర్ అడ్వకేట్‌పై ఇలాంటి ఘటన చోటు చేసుకుంటే, సాధారణ న్యాయవాదుల భద్రతపై ఎంతటి ప్రమాదం ఉందో స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై ఒక సవాల్‌గా భావించాలన్నారు. ఈ నేపథ్యంలో, న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించడం అత్యవసరం అన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సమర్పించిన అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్‌ను తక్షణమే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావతం కాకుండా ఈ దాడికి బాధ్యుడైన వ్యక్తిని తక్షణమే అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకొని శిక్ష విధించాలన్నారు.

పర్వతాధిరోహకుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని ఇసురాళ్లపల్లి గ్రామానికి చెందిన పర్వత అధిరోహకుడు (ట్రెక్కింగ్ మాస్టర్) ఉపేంద్రకు టిడిపి గుత్తి, పామిడి మండలాల ఇన్చార్జి గుమ్మనూరు ఈశ్వర్ శుక్రవారం ఆర్థికసాయం చేశారు. ఉపేంద్ర రష్యాలో ఉన్న మౌంట్ ఎల్బ్రేస్ పర్వతాన్ని అధిరోహించడానికి వెళ్తున్నానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, ఆయన తనయుడు గుమ్మనూర్ ఈశ్వర్‌ను ఇటీవల సంప్రదించాడు. దీంతో గుత్తి పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఉపేంద్రకి గుమ్మనూరు ఈశ్వర్ రూ. 30వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఎంకె.చౌదరి, నాయకులు కెబి. రామకృష్ణ, కోనంకి కృష్ణ, బి.రమేష్, డాక్యుమెంట్ రైటర్ రామకృష్ణ, పవన్‌యాదవ్, న్యాయవాది సోము, తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న బీడీ రోలింగ్ కార్మికులు

బిజెపి ప్రభుత్వంపై అప్రమత్తంగా ఉండాలి


సిఐటియు నాయకులు ఉమాగౌడ్

ప్రజాశక్తి-తాడిపత్రి

కేంద్రంలోని మతోన్మాద బిజెపి ప్రభుత్వంపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సిఐటియు నాయకులు ఉమాగౌడ్ పిలుపునిచ్చారు. వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని నిరసిస్తూ ఎపి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ సమీపంలో ఉన్న పడమటగిరి, టైలర్స్ కాలనీల్లో బీడీ రోలింగ్ మహిళా కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడం బాధాకరమన్నారు. మైనారిటీలపై దాడులను ఖండించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. లౌకికదేశంలో కులాలకు మతాలకు అతీతంగా దేశ సమైక్యత కోసం అందరూ కలిసి ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మతోన్మాద బిజెపి ప్రభుత్వం ఆలంభిస్తున్న మతచిచ్చును ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి బీడీ, షికార్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఆరిఫా, హసీనా, షాను, షఫీ యా బసిరున్, రుక్సానా, జేరినా, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

భూములు స్వాధీనం చేసుకోవాలని వినతి

ప్రజాశక్తి-పుట్లూరు


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం గత వైసిపి హయాంలో సేకరించిన భూములను స్వాధీనం చేసుకోవాలని మండల పరిధిలోని కొమటికుంట్ల, చిన్నమల్లేపల్లి గ్రామాలకు చెందిన రైతులు కోరారు. ఈమేరకు జిల్లా పర్యటనకు వచ్చిన ఇన్‌ఛార్జి మంత్రి టిజి భరత్‌ను శుక్రవారం అనంతపురంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఆయా గ్రామాల రైతులు కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కోమటికుంట్ల, చిన్నమల్లేపల్లి రెవెన్యూలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామని చెప్పి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చిన్న కుమారుడు కేతిరెడ్డి సాయి ప్రతాపరెడ్డి, కోడలు భూసన్నగారి సాయి అచ్చితరెడ్డి, వియ్యంకుడు బుసన్నగారి నీల కంటారెడ్డి పేర్లపై దాదాపు 126 ఎకరాల భూమిని తక్కువ ధరకు కొని రిజిస్టర్ చేయించుకున్నారన్నారు. దీనికితోడు దాదాపు 40 నుంచి 50ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా రాయించుకున్నారన్నారు. అయితే సోలార్ ప్లాంట్ మాత్రం ఏర్పాటు చేయలేదన్నారు. భూములను స్వాధీనం చేసుకోవాలని ఈనెల 21వతేదీన సోమవారం పుట్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద వంటావార్పు చేసి నిరసన కూడా తెలియనున్నట్లు తెలిపారు. కావున వెంటనే స్పందించి సంబంధిత భూమిని స్వాధీనం చేసుకునేందుకు ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విన్నవించారు. ఇందుకు స్పందించిన మంత్రి అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అందరి సమన్వయంతోనే సమగ్రాభివృద్ధి

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అందరి సమన్వయంతో కూటమి ప్రభుత్వంలో సమగ్రాభివృద్ధి సాధించేందుకు జనసేన పార్టీ తనవంతు క్రియాశీలక పాత్ర పోషిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్ అన్నారు. శుక్రవారం అనంతపురం ఆర్అండ్‌బి అతిథి గృహంలో నిర్వహించిన కూటమి పార్టీల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొత్తుధర్మంలో భాగంగా కూటమి ప్రభుత్వ బలోపేతానికి ఎల్లప్పుడూ జనసేన పార్టీ కట్టుబడి ఉంటుందన్నారు. తమ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాలే శిరోధార్యమని ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ సంకల్పాన్ని ప్రతిబింబించేలా జనసేన పని చేస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీకి సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మంత్రికి బొకే అందజేస్తున్న టిసి వరుణ్

పుట్లూరు వైద్యాధికారిగా విష్ణుమూర్తి



పుట్లూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ ఎస్‌బి విష్ణుమూర్తి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న హిమబిందు బదిలీపై వెళ్లగా విష్ణుమూర్తి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పెద్దపప్పూరు మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

బుక్కరాయసముద్రం సిఐగా పుల్లయ్య



బుక్కరాయసముద్రం : మండల సిఐగా పుల్లయ్య శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న కరుణాకర్ బదిలీపై వెళ్లడంతో కడప జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పుల్లయ్యను ఇక్కడికి నియమించారు. దీంతో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా పేకాట, మట్కా, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

ఎస్ఐని కలిసిన బీసీ ఉద్యోగ సంఘం నాయకులు

అనంతపురం క్రైం : నాల్గవ పట్టణ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ప్రసాద్‌ను బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్ఐను కలిసిన వారిలో ఉద్యోగుల సంఘం నాయకులు చింతా చంద్రమోహన్, ఎం.మోతిలాల్, అనంతశేన, శివరుద్రప్ప ఉన్నారు.

గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

యాడికి : మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డులో ఉన్న అగాపే ప్రార్థన మందిరంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గుడ్ ఫ్రైడే సందేశాన్నిఫాదర్ బత్తల ప్రసాద్ వివరించారు.

పామిడి : మండలంలోని అన్నిచర్చిల్లో క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక సిఎస్ఐ ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సిఎస్ఐ చర్చిలో దైవదాసులు పివిఎస్ రాజు, విశ్వమోహన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సుశీలమ్మ, దేవదాసు కుటుంబం భక్తులకు 300 మందికి ప్రేమవిందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వీరయ్య, జకరయ్య, అబ్రహం, రత్నరాజు, ఆనందరాజు, దేవదాసు, బుజ్జి బాబు, క్రిస్టఫర్ బాబు, రూబెన్, కరుణాకర్, బాబావలి, రాజు, సుమిత్ రాజ్, ప్రిస్కిల్లా, డాక్టర్ కమల, శాంతమ్మ, సుశీలమ్మ, రేచేల్, మెర్సీ, అంజలి, చంద్రకళ, జయమ్మ, మాణిక్యమ్మ, వాణి, మహిమ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు

కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కె.నాగరాజు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన సిఎం జగన్ ప్రజలను మోసం చేస్తున్నారని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కె.నాగరాజు, సిపిఎం నాయకులు జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో సిపిఎం మండల కార్యదర్శిగా అమ్మలదిన్నె కుళ్లాయప్పను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి పథకంలో కోతలు విధిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు మాయమాటలు చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక నిండా ముంచారన్నారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. పదినెలల్లోనే ఏడుసార్లు కరెంటు ఛార్జీలు పెంచారని మండిపడ్డారు. మరోవైపు స్మార్ట్ మీటర్లను పగులగొట్టాలని ఎన్నికల ముందు పాదయాత్రలో చెప్పిన నారా లోకేష్ అధికారంలోకి వచ్చా అవే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం బాధాకరమ న్నారు. రానున్న రోజుల్లో ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జయమ్మ, గంగులమ్మ, నాగలక్ష్మి, శ్రీరాములు, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిముల శాంతి ర్యాలీ

నార్పల : ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ముస్లిములు శుక్రవారం మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జామియా మసీదు నుంచి బయలుదేరిన ర్యాలీ బస్టాండ్ మీదుగా విద్యుత్ సబ్‌స్టేషన్ వరకూ వెళ్లి తిరిగి జామియా మసీదుకు చేరుకుంది. ఈ సందర్భంగా ముతవల్లి ఇక్బాల్‌బాషా మాట్లాడుతూ గతంలో రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్లచట్టాలను కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా వెనక్కి తీసుకుందో అదే రీతిలోనే వక్ఫ్ సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో నిరసనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐ సాగర్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. ఈ ర్యాలీలో ఖాజీ ఫయాజ్, మౌలానాలు జిక్రియా, ఫారుక్, మన్సూర్, రేమహన్, పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

మంత్రి టిజి.భరత్‌ను కలిసిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల : జిల్లా ఇన్‌ఛార్జి, రాష్ట్ర పరిశ్రమ, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెస్సింగ్ శాఖ మంత్రి టిజి భరత్‌ను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని శుక్రవారం నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇందులో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

అలాగే ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీతో కలిసి టిడిపి నాయకులు చిన్నజలాలపురం సుధాకర్ మంత్రి భరత్‌ను అనంతపురంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా మండలంలో పార్టీ కార్యక్రమాలపై ఆరాతీశారు.

నెట్టికంటి ప్రసాదానికి కూరగాయలు వితరణ

గుంతకల్లు : కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానంలో వంటలకు నిత్యం కూరగాయలు సరఫరా చేసేందుకు ఎల్‌బి నగర్, ఎన్టీఆర్ మార్కెట్ వ్యాపారులు ఒప్పుకున్నట్లు ఆలయ ఇఒ కె.వాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ ఆదేశాల మేరకు ఎఇఒ వెంకటేశ్వరుడు, అర్చకులు చక్రవర్తి, హరి, తదితరులు వ్యాపారులను కలిసి అన్నదానానికి కూరల్లో వండేందుకు కూరగాయలు ఇచ్చేందుకు దాతలను ఒప్పించినట్లు తెలిపారు. దాతలు ఎవరైనా ఉంటే ముందుకు రావాలని కోరారు.

పాస్టర్‌పై బెదిరింపులు సరికావు

అనంతపురం కలెక్టరేట్ : పాస్టర్ చర్చి నిర్వహిస్తుండటాన్ని కొందరూ మతతత్వవాదులు చర్చి ఖాళీ చేయాలంటూ బెదిరింపులకు పాల్పడటం అన్యాయమని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు జీవరత్నం అన్నారు. శుక్రవారం రాజీవ్‌కాలనీ పంచాయతీలోని చర్చి పాస్టర్ సత్యంను కెవిపిఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో హిందువులే ఉండాలి.. ఇతర మతస్తులు ఉండకూడదని, చర్చిని ఖాళీ చేయాలని లేకపోతే చంపేస్తాం అంటూ బెదిరంచడం అన్యాయంగా ఉందన్నారు. సమస్యపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు డేవిడ్, దేవరాజ్, నాగేంద్ర, రాజా, అకులప్ప పాల్గొన్నారు.

ఇంటింటి ఫీవర్ సర్వే

యాడికి : జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా ఇళ్లల్లోని నీటితొట్లను శుభ్రంగా కడిగి గంటసేపైనా ఆరబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చుక్కలూరు సూపర్‌వైజర్ ఎంపీ నారాయణ, యాడికి 2వ సచివాలయ ఆశా కార్యకర్తలు సులోచన, సుబ్బలక్ష్మి, ముస్కిన్, బి.సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఐడి నెంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

యల్లనూరు : మండలంలోని రైతులందరూ ప్రత్యేక గుర్తింపు నెంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 5,700 మంది రైతులు ఇంకా ఐడి నెంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ ఐడి ద్వారానే ప్రభుత్వ పథకాలకు అర్హులు అవుతారన్నారు. కావున రైతులందరూ తప్పనిసరిగా పార్మర్ ఐడిని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

24న దేశవ్యాప్త సమ్మె

బుక్కరాయసముద్రం : ఈనెల 24వతేదీన దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈమేరకు వుక్రవారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను సక్రమంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నెట్టికంటయ్య, రామకృష్ణ, వేణుగోపాల్, బాషా, చంద్ర, వన్నమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ భూముల కౌలుకు వేలం

పామిడి : మండలంలోని వంకరాజుకాలువలో వెలసిన చెన్నకేశవ, ఆంజనేయ, భైరవస్వామి దేవస్థానానికి సంబంధించిన వ్యవసాయ భూములు సాగు చేసుకునేందుకు కౌలు నిమిత్తం ఈనెల 19న బహిరంగ వేలం వేయనున్నట్లు దేవాదాయ శాఖ ఇఒ కృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న గ్రామస్తులు, భక్తులు పాల్గొనాలని కోరారు.

'వెన్నపూస'ను కలిసిన వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి రంగారెడ్డి

అనంతపురం : వైసిపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డిని పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి సివి రంగారెడ్డి శుక్రవారం అనంతపురంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి బి.కిరణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బిందె గురుప్రసాద్ యాదవ్, రమణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు యాదవ్, అన్వర్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, బాషా, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్షుడిని కలిసిన గుత్తి నాయకులు

గుత్తి : వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని శుక్రవారం అనంతపురంలో గుత్తికి చెందిన వైసిపి నాయకులు కలిశారు. స్థానిక పట్టణానికి చెందిన సివి.రంగారెడ్డికి వైసిపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించడంతో అనంత వెంకటరామిరెడ్డిని కలిసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గురుప్రసాద్ యాదవ్, నాయకులు ఇవి.రమణారెడ్డి, పాల్లేటి మధుసూదన్‌రెడ్డి, అన్ను, శ్రీనివాస్‌రెడ్డి, వెల్డింగ్ రవూఫ్, శ్రీనివాసులుయాదవ్, తిరుపాల్‌రెడ్డి, బాషా, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


గుత్తిలో రైలు ప్రయాణికుడు మృతి


మృతిచెందిన భీమన్న

గుత్తి : రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. జిఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రంలోని యాద్ గిర్ తాలూకా తటల్ గేర గ్రామానికి చెందిన భీమన్న(42) అనే వ్యక్తి భవన నిర్మాణ కార్మికుడిగా బెంగుళూరులో పని చేస్తూ జీవనం కొనసాగించేవాడు. ఈ క్రమంలో యాద్ గిర్ నుంచి బెంగళూరుకు రైలులో బయలుదేరాడు. రైలులో చలనం లేకుండా ఉన్న అతన్ని గుత్తి రైల్వే స్టేషన్ లో తోటి ప్రయాణికులు గమనించి డిఎస్ఎస్ కు సమాచారం ఇచ్చారు. దీంతో భీమన్నను రైలు భోగి నుంచి గుత్తి ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్ లో తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించగా గుండెపోటుతో మరణించి ఉంటాడని నిర్ధారించారు. మృతుడికి భార్య యల్లమ్మ, కుమారుడు రమేష్, కుమార్తె దీపిక ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు జిఆర్పీ ఎస్ఐ తెలిపారు.

స్పాంజ్ ఐరన్ ప్లాంట్‌లో పేలిన బ్యారెల్

కార్మికునికి గాయాలు


గాయపడిన కార్మికుడు

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని అయ్యవారిపల్లి వద్ద ఉన్న సుగుణ స్పాంజ్ ఐరన్ ప్లాంట్‌లో శుక్రవారం బ్యారల్ (డ్రమ్ము) పేలింది. దీంతో వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సుగుణ స్పాంజ్ ఐరన్ ప్లాంట్ లో రోజువారి పనిలో భాగంగా శుక్రవారం బ్యారెల్ (డ్రమ్ము)ను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసే ప్రయత్నంలో డ్రమ్ములోకి గ్యాస్ చేరి ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో గ్యాస్ కట్టర్‌తో కట్ చేస్తున్న కార్మికుడు కుశలన్న గాయపడ్డాడు. గమనించిన స్థానికులు కుశలన్న హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

యువతి ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని ఊబిచెర్ల గ్రామానికి చెందిన ఓ యువతి శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు, యువతి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఊబిచెర్లకు చెందిన యువతి గతేడాది నుంచి అదేగ్రామానికి చెందిన ఓ యువకునితో ప్రేమలో ఉన్నట్లు తెలిసింది. అయితే ఆ యువకుడు పెళ్లికి నిరాకరించడంతో మనస్థాపం చెందిన యువతి ఇంట్లో విషద్రావణం తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న యువతిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకు అనంతపురానికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జూదరులు అరెస్టు

గుత్తి : మండలంలోని రజాపురం గ్రామం సమీపంలో శుక్రవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. రాబడిన సమాచారం మేరకు సిఐ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఐదుగురు జూదరులను అరెస్టు చేసి రూ.17వేలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆశాబేగం, ఎఎస్ఐ రామాంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ జి.హనుమంతు, కానిస్టేబుల్ నాగరాజు, మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని శుక్రవారం కాలవపల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న 8మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాలవపల్లి సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి నిందితులను అరెస్టు చేయడంతోపాటు రూ.3300, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.